



సమావేశంలో మాట్లాడుతున్న కాంతి లాల్ దండే

మహిళలకు ఉచిత బస్సుపై నివేదిక

- రవాణా ఆర్ అండ్ బి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి నివేదిక ఇవ్వాలని రవాణా, ఆర్ అండ్ బి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతి లాల్ దండే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, నేషనల్ హైవే రోడ్లు, ప్రాజెక్టులకు సంబంధించిన సమీక్ష నిర్వహించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 340, 340సి, 150 సి, 40 నేషనల్ హైవేస్ రోడ్లు, ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలని అధికారులను కోరారు. ఎన్ హెచ్ 150 సి కి సంబంధించి బసాపురం, దిన్నె దేవరపాడు గ్రామాలకు సంబంధించి భూమి సమస్యలు పెండింగ్ ఉన్నాయని, నేషనల్‌హైవేస్ కు సంబంధించిన అధికారులు ప్రిన్సిపల్ సెక్రెటరీ దృష్టికి తెచ్చారు.. వారంలోపు వీటిని పరిష్కరించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ కర్నూలు ఆర్‌డిఒను ఆదేశించారు. కర్నూలు - దోర్నాల కు రోడ్ కు సంబంధించి పెండింగులో ఉన్న క్లెయిమ్లను కూడా వారంలోపు పరిష్కరించాలని కర్నూలు రూరల్ తహసీల్దార్‌ను ఆదేశించారు. భూ సేకరణ పరిహారం పంపిణీలో జాప్యం చేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జ్యుడీషియల్ కోర్టుల్లో టాయిలెట్స్ నిర్మా ణాలను ఆగస్టు లోపు పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బి ఎస్‌ఇని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా రోడ్ సేఫ్టీపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రహదారి నియమాలు పాటించేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు తీసుకోవాలని పోలీస్, రవాణా శాఖల అధికారులను ఆదేశించారు.స్కూల్ బస్‌ల ఫిట్ నెస్ పరిశీలించారా అని డిటిసిని ఆరా తీశారు. బస్టాండ్లలో పారిశుధ్య పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు ఆదేశించారు. టాయిలెట్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అన్ని సౌకర్యాలతో ఒక మోడల్ బస్‌స్టేషన్‌ను కూడా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో పూర్తి వివరాలతో జిల్లాకు సంబంధించిన నివేదికను ఇవ్వాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలపై కళాశాలల్లో, ఇతర ప్రాంతాల్లో అవగాహన కల్పించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు.. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ లోడ్, ఎక్స్‌ట్రా ప్యాసింజర్ తదితర అంశాలకు సంబంధించి ఏప్రిల్ నుండి జూన్ 25 వరకు 717 కేసులు నమోదు చేశామని వివరించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఒ వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ మహేశ్వర్‌రెడ్డి, డిటిసి శాంతకుమారి, నేషనల్ హైవేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతా బాయి, నేషనల్ హైవేస్, రోడ్లు భవనాలు, రవాణా, ఆర్‌టిసి శాఖల అధికారులు పాల్గొన్నారు.

బరువును మించి.. బడి సంచి..!



- కేజీ విద్యార్థులకే కేజీల్లో బరువు
- ప్రయివేట్, కార్పొరేట్‌లో నిబంధనలు బేఖాతరు
- విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం

"కర్నూలుకు చెందిన రమేష్ పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో చదువుతున్నాడు. కొన్ని రోజులుగా నడుం నొప్పితో బాధపడుతున్నాడు. మమూలే అనుకుని తల్లిదండ్రులు పట్టించుకోలేదు. క్రమంగా నొప్పి తీవ్రం కావడంతో వైద్యుడిని సంప్రదించారు. బరువును మించి బడి సంచి మోయడంతోనే ఆ సమస్య తలెత్తినట్లు వైద్యుడు తెలిపారు. ఆ ఒక్క రమేష్‌దే కాదు. ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరిదీ అదే పరిస్థితి"..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉదయం ఎనిమిది అయ్యిందంటే.. విద్యార్థులు బడి సంచులు భుజాన వేసుకుని భారంగా నడవడం చూస్తుంటాం. మెడ వంగిపోతుందా అనేలా ఆ బడి సంచి బరువుంటుంది. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపించే బ్యాగు మోత తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. శక్తి మించి బరువుండే పుస్తకాల సంచిని మెడలో వేసుకొని వెళ్తే నానా అవస్థలు పడుతుంటారు. పిల్లల శరీర బరువులో బ్యాగు బరువు 10 శాతం మించొద్దనే విషయమై విద్యావేత్తలు అనేక సార్లు సూచించినా ప్రభుత్వాలు నియమించిన విద్యా కమిటీలు ఆ మేరకు ప్రతిపాదనలు చేసినా అమలు కొరవడింది. దీనిపై నిర్దిష్ట ప్రయత్నాలు జరగడంలేదని విద్యా నిపుణులు, పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. కర్నూలు జిల్లాలో 745 ప్రయివేటు పాఠశాలలు, నంద్యాల జిల్లాలో 559 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం సాధారణంగా 8 నుంచి 10 తరగతి చదివే ఆరోగ్యకరమైన చిన్నారి బరువు 25 నుంచి 35 కేజీలు ఉంటుంది. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు 10 నుంచి 15 కేజీల బరువున్న పుస్తకాల బ్యాగులను మోసుకుంటూ వెళుతున్నారు. నిబంధనల ప్రకారం 1 తరగతి విద్యార్థి 750 గ్రాములు, 2వ తరగతి 2 కేజీలు, 3, 4 తరగతుల పిల్లలు 3 కేజీలు, 5వ తరగతి 4 కేజీలు, 6 తరగతి 6 కేజీలు, 7వ తరగతి 8 కేజీలు, 8వ తరగతి 10 కేజీలు, 9, 10 తరగతుల పిల్లలు 12 కేజీలు మాత్రమే బరువు మో యల్సి ఉంది. ఈ నిబంధనలకు భిన్నంగా రెట్టింపు బరువు మోస్తున్నారు. ఆయా స్కూల్ బ్యాగులను మోస్తున్న విద్యార్థులు చిన్న వయసులోనే నడుము, మోకాళ్ల నొప్పులు, ఇతరత్రా అర్థో సమస్యలతో బాధ పడుతున్నట్లు తల్లి దండ్రులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్కూలు బ్యాగుల బరు వును తగ్గించాలని భావించిన ప్రభుత్వం గతంలో ఆయా పాఠ శాలల యాజమాన్యాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ వీటిని అమలుచేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

ఎదుగుదలపైనా ప్రభావం

బడి సంచి బరువు పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని యూనిసెఫ్‌తో పాటు వివిధ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలోనే పుస్తకాల బరువు అధికంగా ఉంటుంది. క్లాస్, ఫెయిర్ వర్క్ కోసం ప్రత్యేకంగా వేరువేరు నోట్ బుక్కులు ప్రతిరోజూ తెప్పిస్తున్నారు. ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేని పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను భద్ర పర్చుకునేందుకు తరగతి గదుల్లో అల్మారాలు, ర్యాక్‌లను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. కానీ ఏ ఒక్క పాఠశాలలోనూ ఈ ఏర్పాట్లు లేవు. కొన్ని పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లో ఉండటంతో మోత బరువుతో మెట్లు ఎక్కుతున్న విద్యార్థులు వెన్ను, మోకాళ్ల నొప్పులతో సతమతం అవుతున్నారు. శక్తికి మించి బరువు మోయడంతో వారి ఎదుగుదలపై కూడా ప్రభావం పడుతోంది.

ప్రయివేటు పాఠశాలల్లో ఇలా...

తరగతి	బడి సంచి బరువు (కిలోలు)
ఒకటి	6
రెండు	7
మూడు	9
నాలుగు	12
ఐదు	14
ఆరు	16
ఏడు	18
ఎనిమిది	20
తొమ్మిది	20
పది	25

విద్యార్థుల ఆరోగ్యాలను కాపాడాలి



కేవలం డబ్బులే ధ్యేయంగా జిఓ 1 పాటించకుండా ఇష్టానుసారంగా పుస్తకాలు అమ్ముతూ వారి లబ్ధి కోసం విద్యార్థులపై బరువు మోపుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో బరువు చూసి విద్యార్థులను అనుమతిస్తున్నారు. మన దగ్గర మాత్రం విద్యా శాఖ అధికారులు విద్యార్థుల బ్యాగు బరువుకు ఉన్న నిబంధనలను పాటించని పాఠశాలలపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో బరువులు మోయలేక విద్యార్థుల ఆరోగ్యాలు పాడవుతున్నాయి. ఇప్పటికైనా విద్యా శాఖ అధికారులు స్పందించి విద్యార్థుల ఆరోగ్యాలను కాపాడాలి.

- రంగప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

టిసి.లక్ష్మమ్మ స్ఫూర్తితో ఉద్యమం

- ప్రస్తుత సమాజంలో-మహిళ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

టిసి లక్ష్మమ్మ చూపిన ఉద్యమ మార్గంలో మహిళలు నడవాలని, ప్రస్తుత సమాజంలో మహిళలపై మతోన్మాదుల దాడులకు ప్రతిఘటించాలని ఆమె వర్ధంతి సభలో వక్తలు అన్నారు. కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో టిసి లక్ష్మమ్మ పదవ వర్ధంతిని పురస్కరించుకుని 'ప్రస్తుత సమాజంలో-మహిళలు' అంశంపై ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముందుగా టిసి.లక్ష్మమ్మ చిత్రపటానికి ఐద్వా, ఆయా సంఘాల నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ మహిళల చదువుతోనే సమాజం మార్పు చెందుతుందని అన్నారు. టిసి లక్ష్మమ్మ కుల మతాలకతీతంగా అందరినీ దగ్గర చేర్చుకొని ఆప్యాయంగా పలకరిస్తూ ఉండేవారని అన్నారు. తన కుటుంబ బాధ్యతలతో పాటు తెల్లవారుజామున లేచినప్పటి నుంచి పడుకునేంతవరకు కష్టపడుతూ మహిళలను చైతన్య పరిచి మహిళా సంఘం అభివృద్ధికి కషి చేశారన్నారు. తాను అనుకున్న లక్ష్యసాధన కోసం పరితపిస్తూ బీడీ కార్మికుల వద్దకు, బట్టలు ఉతికే వారి వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. ఆమె కేవలం 5వ తరగతి వరకు చదువుకున్నప్పటికీ మానవ సంబంధాలతో తమ లక్ష్యసాధనకు కృషి చేశారన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు ఉండాలని, ఆర్థిక సాధికారత కోసం కృషి చేశారన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని క్రమశిక్షణతో చదువుపై శ్రద్ధ వహించాలని చెప్పారు. 1991 తరువాత ప్రపంచీకరణలో భాగంగా భార్యాభర్తలు ఇద్దరూ పని చేస్తే గాని పూట గడవని పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. మహిళలు నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆమె లక్ష్మమ్మ కాదు లక్ష్యమ్మ అని చెప్పడంలో సందేహం లేదన్నారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి. నిర్మల మాట్లాడుతూ టిసి లక్ష్మమ్మ అందరికీ అమ్మ అని చెప్పారు. ఆమె బుధవారపేట పాతబస్తీలలో బీడీ కార్మికులతో కలిసి పనిచేస్తూ వారి వేతనాల పెంపునకు కృషి చేశారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను కూడా ఆమె తెలుసుకొని పరిష్కారం చేసేవారని అన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉండేదని చెప్పారు. ఆమె పాడి పోషణ చేస్తూ టైలర్‌గా పని చేస్తూ మహిళా సంఘానికి ఎనలేని కృషి చేశారన్నారు. మహిళలపై ఏమి జరిగినా వెంటనే స్పందించే మనస్తత్వం, అందరికన్నా ముందుండేవారని చెప్పారు. మహిళల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి అన్నారు. కేంద్ర మంత్రి మహిళలు వేసుకునే డ్రెస్సుల వల్లనే అత్యాచారాలు జరుగుతున్నాయని చెప్పడం సరికాదన్నారు. బాలికల నుంచి పండుముసలి వరకు మహిళలపై అత్యాచారాలు ఏడ్రస్సులు వేసుకోవడంవల్ల జరుగుతున్నాయని ప్రశ్నించారు. మణిపూర్ సంఘటనలో మహిళలపై జరిగిన అఘాయిత్యం పై మోడీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రధాని మను సంస్కృతిని అమలు చేస్తున్నారని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడితే నేరస్తులుగా చిత్రీకరిస్తూ ఉన్నారన్నారు. యుపి, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో మహిళలపై హింస జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని, కూటమి ప్రభుత్వంలో మహిళలకురక్షణ లేదని అన్నారు. మహిళలకు బడ్జెట్‌లో తగిన నిధుల కేటాయింపులు లేవన్నారు. సమాజంలోని కుళ్ళును పారదోలెందుకు అందరం కృషి చేయాలన్నారు. టిసి లక్ష్మమ్మ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజంలో ఉన్న మహిళలను చైతన్య పరిచేందుకు కృషి చేయడమే ఆమెకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఐద్వా అధ్యక్షులు అరుణమ్మ, ఐద్వా ఓల్డ్ సిటీ మహిళా నాయకులు పద్మ మాట్లాడుతూ టిసి లక్ష్మమ్మ లాంతరు పట్టుకొని చదువు నేర్పేవారన్నారు. మహిళా సాధికారత కోసం పనిచేశారని ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ఎంపి బసవరాజు, సిఐటియు నాయకులు ఎం.గోపాల్, టిసి లక్ష్మమ్మతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బసవరాజు అమ్మ గొప్పతనాన్ని వివరిస్తూ అమ్మ కదా మహిళ అవని కదా మహిళ జన్మకదా మహిళ మహిళా ఓ మహిళా అంటూ గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు లోకేష్, రాజు, నోమేశ్వరి, సరిత, లక్ష్మి, నాగ సుంకన్నలు అమ్మ, మహిళల గొప్పదనాన్ని వివరిస్తూ గేయాలను ఆలపించారు. పిఎస్.సుజాత వందన సమర్పణ తో సదస్సు ముగిసింది.



నివాళులర్పిస్తున్న నాయకులు



నిరసన చేపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

2003 డిఎస్‌సి నియామకం పొందిన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లో 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, బిటిఎ జిల్లా గౌరవ అధ్యక్షుడు రామ శేషయ్య, అప్ట జిల్లా అధ్యక్షుడు సేవాలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానాన్ని అమలు చేయరాదన్నారు. ఒపిఎస్ విధానం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒపిఎస్ అమలకు సంబంధించి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఉద్యమానికి ఉపాధ్యాయ సంఘాలు అండగా ఉంటాయని వారు పేర్కొన్నారు.



-పనులను ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, కమిషనర్ విశ్వనాథ

టిడిపి, వైసిపి మధ్య భగ్గుమన్న విభేదాలు

-పదవ వార్డులో వైసిపి కార్యాలయం ధ్వంసం -టిడిపి నాయకుడికి గాయాలు
-వన్ టౌన్ పిఎస్‌లో పరస్పరం ఫిర్యాదులు-ఇరు గ్రూపులపై కేసు నమోదు

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్ : కర్నూల్ నగరంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. నగరంలోని పదవ వార్డులో గురువారం చోటు చేసుకున్న ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం రాత్రి వైసిపి కార్యాలయంపై కొంతమంది టిడిపి నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో టిడిపి, వైసిపి నాయకులు పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వైసిపి నాయకులు తమ కార్యాలయం పై దాడి చేశారని సంబంధిత టిడిపి నాయకులపై కేసు నమోదు చేయాలని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా పదవ వార్డు టిడిపి ఇన్చార్జి, టిడిపి నాయ కులు, మహబూబ్ కుతీవ్ర గాయాలు కావడంతో తనపై వైసిపి కార్పొరేటర్ కార్యకర్తలు, హత్యాయత్నం చేశారని వైసిపి నాయకులపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మెహబూబ్ కర్నూలు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. సదరు విషయమై ఒకటవ పట్టణ సీఐ రామయ్యనాయుడును వివరణ కోరగా వైసిపి, టిడిపి ఇరు గ్రూపు నాయకులు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు

అమీర్‌మియ్యా భవనం సామర్థ్య స్థితిపై తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్.

నగరంలోని పాతబస్తీ చిదంబరావు వీధిలో శిథిలావస్థలో ఉన్న అమీర్‌మియ్యా భవనాన్ని శుక్రవారం బెంగుళూరుకు చెందిన బ్యూరో వెరిటాస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ తనిఖీ చేసింది. పురాతన భవనం ప్రమాదమని భావించి నగరపాలక సంస్థ సదరు భవన సామర్థ్య స్థితిపై బ్యూరో వెరిటాస్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తుంది. 2-3 రోజుల పాటు ఈ సర్వే కొనసాగనుంది. అనంతరం బ్యూరో వెరిటాస్ నివేదిక ఆధారంగా నగరపాలక అధికారులు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. కార్యక్రమంలో బ్యూరో వెరిటాస్ సంస్థ ప్రతినిధులు, పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి సి బెళగల్

ప్రస్తుతం గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నాయని క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేయాలని, మండల ప్రత్యేక అధికారి జివి రమణా రెడ్డి సంబందించిన అధికారులకు సూచించారు. శుక్రవారం పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ రాణెమ్మ సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలకు భూమిలో కొత్త నీరు చేరి ఆ నీరు ట్యాంకులకు చేరి ఆపై మనం తాగుట వలన సీజనల్ వ్యాధులు అంటిపెట్టుకొని ఉన్నాయని అప్రమత్తం చేయుటలో అలసత్వం ఏమాత్రం తగదని పేర్కొన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో విషజ్వరాలు ప్రభలి అసువత్రి పాలవుతున్నారని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి చెత్త చెదారం లాంటివి ఎత్తివేసి అక్కడ బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేసి సురక్షితమైన నీటిని అందించాలని తెలిపారు. అంతేకాకుండా మండలంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను సక్రమంగా సాగించాలని అలాగే పి ఫోర్ పి సర్వేను ముమ్మరం చేసి గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయా శాఖధికారులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పిఎంలతో రైతులకు నష్టం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం
ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



కల్లూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రామకృష్ణ

జాయింట్ ఎల్‌పిఎంలతో రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. మండలంలోని ఉలిందకొండ, కొల్లంపల్లి తండా గ్రామాల రైతుల జాయింట్ ఎల్‌పిఎంలు విడదీసి ఆన్‌లైన్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం , బాధిత రైతులు కల్లూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. జి. రామకృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి ఎ.కష్ణ, సిఐటి యు మండల కార్యదర్శి కె.మధు హాజరయ్యారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ భూములను రీసర్వే చేసిన సందర్భంగా ఉలిందకొండ, కొల్లంపల్లి తండా గ్రామాలలోని 85 మంది రైతులకు జాయింట్ ఎల్‌పిఎం ఇవ్వడం వలన వారికి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలకు వారు దూరమవుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సమస్యలు,ఆన్‌లైన్ సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి 13 నెలలైనా ఎల్‌పి ఎం సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అన్నాడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రీ సర్వే గ్రామసభ, రెవిన్యూ గ్రామ సభలు , ఈ గ్రామ సభలో ఆన్‌లైన్ సమస్యలు 45 రోజుల్లోగా పరిష్కరిస్తామని చెప్పారన్నారు. అయినా ఇంతవరకు సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించడంలో రెవిన్యూ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని వారన్నారు. తహశీల్దార్ స్పందించి జాయింట్ ఎల్‌పిఎం సమస్యను పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కారం కానీ ఎడల గ్రామాలలోని రైతులను ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. పూలరంగడు, మారన్న, రమేష్, గోపాల్ నాయక్, వెంకట స్వామి నాయక్, చిన్న శివమ్మ, రాధమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్డియాలజీ విభాగంలో అరుదైన స్టంట్

వైద్యులను అభినందించిన సూపరింటెండెంట్

కర్నూలు-ప్రజాశక్తి హాస్పిటల్ : ఎడమ చేతి రక్తనాళాలు మూసుకుపోయి ఇబ్బంది పడుతున్న రోగికి కర్నూలు ప్రభుత్వ సర్వజన హాస్పటల్ కార్డియాలజీ విభాగపు వైద్యులు అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. విలేకరుల సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్, కార్డియాలజీ విభాగపు హెచ్‌ఒడి ప్రొఫెసర్ ఆదిలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడారు. నంద్యాల జిల్లా మిడుతూరు చెందిన 45 యేళ్ల చంద్రావతి ఎడమ చేయి నొప్పితో బాధపడుతూ బయట చూపించుకున్నారని, రొటీన్ గా బ్లడ్ ప్రెజర్, పల్స్‌చెక్ చేశారన్నారు. కుడి చేయికి ఎడమ చేయికి మధ్య తేడా ఉందని గమనించి దానికి సంబంధించిన అయోట్రోగ్రామ్ టెస్ట్ వల్ల ఎడమచేతికి సప్లై చేసే రక్తనాళాలు పూర్తిగా బ్లాక్ అయ్యిందని తెలిసి జూన్ 27న ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియోథొరాసిక్ విభాగంలో అడ్మిట్ అయ్యారని తెలిపారు. ఆ విభాగం వారు చూసి దీనికి శస్త్ర చికిత్స అవసరం లేదని మూసుకుపోయిందని దానికి ఆపరేషన్ లేకుండా కూడా ఓపెన్ అవుతుందని వారు కార్డియాలజీ విభాగానికి జులై 11న రిఫర్ చేశారని తెలిపారు. దీనిని కార్డియాలజీ విభాగం చాలా అరుదుగా వచ్చే సమస్య అని ఇది కొవ్వు పేరుకుపోవడం రక్తం గడ్డ కట్టడం వల్ల రక్తనాళాలు మూసుకుపోతాయని అన్నారు. ఇవి ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సహకారంతో పెద్ద స్టంట్లను కొనుగోలు చేసి వాటితో ఈనెల 14న కాలులో నుంచి పైపును పంపించి దానిలో నుంచి వైరుని పంపి ఎలాంటి కోత లేకుండా రక్తనాళాన్ని ఓపెన్ చేశామని తెలిపారు. దాంతో కుడివైపు చేతి లాగానే ఎడమవైపు చేతి రక్తనాళాలలో రక్త ప్రసరణ జరుగుతుందన్నారు. ఈ ప్రొసీజర్‌ను కర్నూలు సర్వజన వైద్యశాలలో తొలిసారి చేశామన్నారు. ఈ చికిత్సకు ప్రైవేట్ హాస్పిటల్లో దీనికి రూ రెండున్నర లక్షలు ఖర్చవుతుందని దీనిని ఆరోగ్యశ్రీలో ఉచితంగా చేశామని తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎడమ చేతి రక్తనాళాలు మూసుకుపోవడం ద్వారా కార్డియాలజీ విభాగపు వైద్యులు కోరగానే వాటిని హెచ్‌డిఎస్ నుండి అనుమతి మంజూరు చేశామని, ఈ స్టంట్ వేయకపోతే రక్తనాళాలు మూసుకు పోయి రక్త ప్రసరణ ఆగిపోయి నొప్పి రావడం వంటివి జరుగుతాయన్నారు. ఒక్కోసారి చేయి కూడా పోయే ప్రమాదం ఉందని వైద్యులు కోరగానే ఇది తెప్పిం చి వేశామన్నారు. ఇది విజయ వంతంగా చేసిన వైద్యులను ఆయన అభినం దించారు. కార్డి యాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రశాంత్, కిరణ్ కుమార్‌రెడ్డి, రవికిరణ్, లలిత, రాజ్ కుమార్ పాల్గొన్నారు.



కోలుకున్న మహిళతో వైద్యులు

ప్రగతి పనులను పూర్తి చేయాలి

-పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో ప్రగతి పనులను వేగవంతం చేయాలని, నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పరిధిలో ఆరు వార్డుల్లో రూ.2.30 కోట్ల విలువ గల అభివృద్ధి పనులకు కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎన్‌క్యాప్ నిధులతో 32, 35వ వార్డుల పరిధిలో చెన్నమ్మ సర్కిల్ నుండి ఎపిఐఐసి కార్యాలయం వరకు రూ.90 లక్షలతో రహదారి విస్తరణ, 36వ వార్డు వై.జంక్షన్ నుండి పెద్దపాడు వరకు రూ.25 లక్షలతో డివైడర్లలో పచ్చదనం పెంపు పనులకు, సాధారణ నిధులతో 30వ వార్డులో సుంకులమ్మ ఆలయం నుండి హంద్రీ నది వరకు రూ.49.95 లక్షలతో డిస్పోజబుల్ డ్రైన్, 37వ వార్డు శరీన్ నగర్‌లో రూ.50 లక్షలతో సిసి డ్రైన్, 41వ వార్డు సిద్దార్థ హోమ్‌లో రూ.15 లక్షలతో సిసి డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే, కమిషనర్ శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జయరాముడు, ఎంఇ లీలాప్రసాద్, డిఇఇ క్రిష్ణలత, ఎఇ భాను ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన కూటమి సర్కార్

మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగించిందని నంద్యాల జిల్లా వైసిపి అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఓర్వకల్లు మండల కేంద్రంలో వైసిపి మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు శ్రీ రెడ్డి చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసి ఇప్పటివరకు వాటిని అమలు చేయలేదన్నారు. విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై దారాలను మోపారన్నారు. సూపర్ సిక్స్ హామీలను కూడా అమలు చేయలేదన్నారు. ఈ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్ళేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి రంగనాథ్‌గౌడ్ , ఎంపిపి తిప్పన్న మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న నాసరరెడ్డి

ప్రజాశక్తి - నందవరం

పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నందవరం మండలంలో పర్యటించారు. ముందుగా మండలంలోని పెద్దకొత్తిలి గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగాలని తెలిపారు. విజయవాడ నుంచి వచ్చే ఐవీఆర్ఎస్ కాల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో పరిశుభ్రత లోపం, తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలని తెలిపారు. హరిత రాయబారులకు జీతాలు ఎప్పటికప్పుడు ఇవ్వాలని, కాలయాపన చేస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిఎస్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేపట్టే పనులను వివరించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

పి4 సర్వేను వేగవంతం చేయండి

- మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వెంకట రంగనాథ్ బాబు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న పి4 సర్వేను, హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వెంకట రంగనాథ్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ అల్లాబకాష్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏ సమాచారం అడిగినా వెంటనే అప్‌లోడ్ చేయడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. పి4 సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిలిచిపోయిన హౌసింగ్ నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేయాలని, ఉపాధి హామీ పనుల శాతం పెరగాలని సూచించారు. ఎంఇఒ సావిత్రమ్మ, హౌసింగ్ ఎఇ విజయ్ కుమార్, ఏపీవో జుబేర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు బాలన్న, జయరామ్ నాయక్, సిసింద్రీ, సురేంద్ర, ప్రమీల, నరసింహులు పాల్గొన్నారు.

21 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి సమ్మె చేస్తున్నట్లు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, బి.కేశన్న, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. 21న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు కె.ఖాజా, కోర్ బాషా, ఆరిఫ్, పక్కీరప్ప, ఎస్.రాజు, ఉరుకుందు, ఆదెన్న, జడేసాబ్, ఇస్మాయిల్, నరసింహులు పాల్గొన్నారు.

వర్షం కురవాలని పూజలు

ప్రజాశక్తి - హొళగుంద



గంగా జలంతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు


సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని స్థానిక మారెమ్మ అవ్వ, దేవమ్మ అవ్వ దేవాలయంలో శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం బస్టాండ్ వద్ద ఉన్న పురాతన బావి నుంచి గంగాజలం తీసుకొచ్చి.. గ్రామంలోని బొడ్రాయికి, మారెమ్మ, దేవమ్మ అవ్వలకు జలాభిషేకం చేశారు. గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

సోలార్ బాధితుల సదస్సును జయప్రదం చేయండి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆలూరు

సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో వ్యవసాయ భూములను కారు చౌకగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు దళారులతో ఇప్పిస్తున్న ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ నంద్యాలలో ఈనెల 20న జరిగే రైతు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు కోరారు. శుక్రవారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'ఈజ్ ఆఫ్ డూయింగ్' పేరుతో రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలో లక్షల ఎకరాలను సోలార్ విద్యుత్ ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు ఒప్పందం చేసుకుందని తెలిపారు. నంద్యాల జిల్లాలో 25 వేలు, కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో 20 వేల ఎకరాలు లీజ్ పద్ధతిలో ఎకరా రూ.31 వేలు, ఎకరాకు రూ.5 లక్షలు ఖరీదు భూములు కొనుగోలు చేసేందుకు కంపెనీలకు అవకాశం కల్పించిందని చెప్పారు. ఏడాదికి తక్కువ లీజు, తక్కువ ఖరీదుతో కంపెనీలు నెలకు రూ.లక్షల్లో లాభాలు పొందేందుకు, రాయలసీమ కరువు ప్రాంత రైతులను నట్టేట ముంచేందుకు ప్రభుత్వాలు, కార్పొరేట్ విద్యుత్ సంస్థలు ఒక్కటయ్యాయని విమర్శించారు. వ్యవసాయ భూములు కోల్పోతున్న సోలార్, గ్రీన్ ఎనర్జీ బాధిత రైతులు ఈనెల 20న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. రైతుసంఘం నాయకులు పి.హనుమంతు, ఈరన్న, కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

కంప చెట్లు తొలగించాలి : గ్రామస్తులు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ నుంచి పరిముక్కల రహదారికిరువైపులా కంపచెట్లను తొలగించాలని గ్రామస్తులు నాగేశ్వరరావు, రెడ్డి వర్ధన్ రెడ్డి, మోహన్ కోరారు. శుక్రవారం ఎంపిడిఒ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రహదారికిరువైపులా కంప చెట్లు పేరుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని కోరారు.



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్నుపోటు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి పాలనకు, బాబు పాలనకు ఉన్న తేడాను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఒక్క ఏడాదిలో జగన్ అమలు చేసిన పథకాలు ఎన్ని ఉన్నాయో కూటమి నాయకులు చూసుకోవాలన్నారు. కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, వైసిపి మండల నాయకులు మహేంద్ర రెడ్డి, నాగరాజ్ గౌడ్, ఏకం రెడ్డి, చెన్నప్ప, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, సర్పంచి పాల్ దినకరన్, వైసిపి నాయకులు గురునాథ్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, సుధాకర్ రెడ్డి, తోవి నర్సప్ప, నర్సారెడ్డి, శివరాం, అనిల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి

రాయలసీమ ద్రోహి జగన్

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమ బిడ్డగా చెప్పుకునే జగన్ రాయలసీమ ప్రాజెక్టులను నాశనం చేశారని విమర్శించారు. సీమలో లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో జగన్ రూ.782 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును నిజమైన రాయలసీమ బిడ్డగా అభివర్ణించారు.

తీగలు ఏర్పాటు చేయాలి

- రాళ్ల చేను కాలనీవాసులు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని రాళ్ల చేను కాలనీలో 25 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నామని, తమ కాలనీలో విద్యుత్ కనెక్షన్ కోసం ఏడాది క్రితం విద్యుత్ స్తంభాలు పాతారని, ఇప్పటివరకు దానికి వైర్ కనెక్షన్ ఇవ్వలేదని కాలనీ వాసులు కొండా అమరేష్, లక్ష్మన్న, మొట్టమారి సిద్ధలింగ తెలిపారు. శుక్రవారం విద్యుత్ ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొండ ప్రాంతమైన తమ కాలనీలో రాత్రి సమయంలో విషపురుగులు (పాములు) ఎక్కువగా వస్తాయని తెలిపారు. రెండేళ్ల క్రితం 3 గుడిసెలు విద్యుదాఘాతానికి గురై దగ్ధమయ్యాయని చెప్పారు. విద్యుత్ స్తంభాలకు వైర్ కనెక్షన్ ఇవ్వాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

భవిష్యత్తు తరానికి భరోసానివ్వాలి : పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - ఆలూరు

భవిష్యత్తు తరానికి ఉపాధ్యాయులు, మేధావులు, ఉద్యోగులు భరోసానివ్వాలని స్వామి వివేకానంద పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి బి.రంగముని, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎన్.రంగస్వామి తెలిపారు. శుక్రవారం ఆలూరు మెయిన్ స్కూల్‌లో సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో 10వ తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు, మోడల్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి.ఈరన్న అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఆలూరు, హొలహర్వి ఎంఇఒలు చిరంజీవి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఆర్.రాఘవ రావు పాల్గొని మాట్లాడారు. పూర్వ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాన్ని ఎంచుకొని ఆదర్శంగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. రిటైర్డ్ డీఎస్పీ వై.శ్రీరాములు, రిటైర్డ్ అధ్యాపకులు సి.జయరామ్, రిటైర్డ్ టీచర్ గోవిందప్ప, రిటైర్డ్ డివిజనల్ పంచాయతీ అధికారి ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం

వెటర్నరీ వైద్యుని నియమించండి

- సర్పంచి దాసరి గోవిందరాజులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరికి వెటర్నరీ వైద్యుని నియమించాలని ఆలూరు ఎడి ధనుంజయుడును సర్పంచి దాసరి గోవిందరాజులు కోరారు. శుక్రవారం ఎడి ధనుంజయుడు చిప్పగిరి వెటర్నరీ కార్యాలయానికి రాగా సర్పంచి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిప్పగిరిలో వెటర్నరీ వైద్యులుగా విధులు నిర్వహిస్తున్న ప్రసన్న బాయి బదిలీల్లో హొలహర్వికి వెళ్లారని, ప్రస్తుతం చిప్పగిరికి ఎవరూ రాకపోవడంతో పశువులు ఉన్న రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే వెటర్నరీ వైద్యుని నియమించాలని కోరారు. చిప్పగిరిలో పశువులు ఉన్న రైతులు చాలామంది ఉన్నారని, పశువులకు సీజనల్ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో వెటర్నరీ వైద్యుని తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఎడి ధనుంజయుడు మాట్లాడుతూ... ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే వెటర్నరీ వైద్యుని నియమించేందుకు కృషి చేస్తామన్నారు. విఎఎస్ అశోక్ కుమార్, వెటర్నరీ సిబ్బంది మహేష్, వినయ్, సాయి, మంజుల, శివ, గాదలింగ, నారాయణ పాల్గొన్నారు.



ఎడి ధనుంజయుడును కోరుతున్న సర్పంచి గోవిందరాజులు

హత్య కేసుపై డీఎస్పీ విచారణ

ప్రజాశక్తి - మంత్రాలయం

అనుమానాస్పద స్థితిలో బోయ దుళ్లయ్య మృతి చెందిన ఘటనపై డీఎస్పీ ఉపేంద్ర బాబు విచారణ చేపట్టారు. గురువారం రాత్రి స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మల్కాపురం గ్రామానికి చెందిన నరసయ్య కుమారుడు బోయ దుల్లయ్య (35) మృతి చెందారు. ఈ విషయంపై శుక్రవారం సంఘటన స్థలం సమీపంలో ఉన్న దుకాణాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిసి పుటేజీ ఆధారంగా విచారణ చేపట్టిన సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్‌లు నిందితుని అరెస్టు చేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న దుళ్లయ్య తమ ట్రాక్టర్ ముందు భాగంలో ఉన్న విరగ్గొడతావని మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన టిడి.నరసయ్య కుమారుడు రామకృష్ణ కాలితో తన్ని వెనక్కి తోయడం వల్ల రోడ్డుపై పడి తల వెనుక భాగంలో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారని విచారణలో తేలిందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మృతుడి రక్త నమూనాల సేకరణ

మృతి చెందిన దుళ్లయ్య రక్త నమూనాలను క్లూస్ టీం సేకరించింది. డీఎస్పీ ఉపేంద్ర బాబు ఆదేశాల మేరకు క్లూస్ టీం సిఐ పవన్ కుమార్ రెడ్డి, సిబ్బంది అన్వర్ బాష, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి, పోలీసు సిబ్బంది గోపి సంఘటన స్థలంలో రక్తపు మరకలు ఉన్న మట్టిని సేకరించారు.



విచారణ చేపడుతున్న పోలీసులు



మాట్లాడుతున్న తిక్కా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి

ప్రాజెక్టుల నిర్వహణకు రూ.3.22 కోట్లు


- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు రూ.3.22 కోట్లు మంజూరైనట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న కోసిగి మండలంలోని దుద్ది, సాతనూరు, మూగలదొడ్డి, మంత్రాలయం మండలంలోని మాధవరం-1, 2, బసలదొడ్డి, చిలకలడోన, శ్రీగురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులో భాగంగా ఎత్తిపోతల పంపు హౌస్‌లకు, సాగునీటి ప్రాజెక్టులకు మరమ్మతులు, నిర్వహణకు రూ.3.22 కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమన్నారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ పనులు సైతం త్వరలో ప్రారంభమవుతాయన్నారు.

జిల్లా పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శిగా శాంతి కుమార్

ప్రజాశక్తి- దేవనకొండ



జిల్లా పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శిగా దేవనకొండ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, బీసీ సామాజిక వర్గానికి చెందిన శాంతి కుమార్‌ను ఎన్నుకున్నట్టు టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి కుమార్ మాట్లాడుతూ... ఎన్నికల్లో టిడిపి అభివృద్ధికి, బలోపేతానికి చేసిన కృషి, సేవలను గుర్తించి తనకు పదవి ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. అధిష్టానం ఇచ్చిన పదవికి కట్టుబడి పనిచేసి పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చిన అధినేత చంద్రబాబు నాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, తిక్కా రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటికీ తిరుగుతూ.. ముందుకు సాగుతూ..!

- రెండో రోజూ ఎమ్మెల్యే బీవీ పర్యటన



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ


ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వీరంపల్లి గ్రామంలో రెండో రోజూ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి పర్యటన సాగింది. శుక్రవారం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకొని 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ముందుకు సాగారు. ప్రతి ఇంటికీ వెళ్లిసంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, గ్రామంలో ప్రధానంగా ఎలాంటి సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. జాయింట్ ఎల్‌పిఎంల ద్వారా పొలాల విస్తీర్ణం అధికంగా నమోదు కావడంతో తాము తల్లికి వందనం పథకానికి అనర్హులయ్యామని గ్రామస్తులు ఎమ్మెల్యేతో వాపోయారు. జాయింట్ ఎల్‌పిఎం సమస్యలను గ్రీవెన్స్ ద్వారా నమోదు చేసుకొని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి వారందరి తల్లికివందనం అందేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ తహశీల్దార్ రఘువీరాను ఆదేశించారు. గ్రామంలో మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలు ఉన్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా వెంటనే మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, వీలైనంత త్వరగా తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య, కైరవాడి తిమ్మారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు సంజీవయ్య ఆచారి, ఈదులదేవర బండ సుభాన్, తిప్పనూరు కౌలుట్లయ్య, రామకృష్ణ, రాఘవేంద్ర నాయుడు పాల్గొన్నారు.

బాబు రాకతోనే అభివృద్ధికి అడుగులు

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ఆదోని : వైసిపి అరాచక పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందని, ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేయిస్తున్నారని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. పట్టణంలోని 20వ వార్డు సాయిబాబా నగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' వార్డు ఇన్‌ఛార్జీ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, ఎల్ఎల్‌సి కమిటీ ఛైర్మన్ బసాపురం రామస్వామి, మదిరే సింగిల్ విండో ఛైర్మన్ దామోదరం చౌదరి హాజరయ్యారు. నాయకుల బృందానికి ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై కరపత్రాలను ఇంటింటికీ తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడారు. అనాలోచిత నిర్ణయాలతో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని దివాలా తీయించారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలాగా భావిస్తూ అన్ని వర్గాలకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఆయనకు ప్రజలు అండగా నిలిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు ద్వారా మద్దతు ప్రకటించాలని కోరారు. నాయకులు తిమ్మప్ప, గుడిసె శ్రీరాములు, ఉమ్మి సలీం, రంగస్వామి నాయుడు, లక్ష్మీనారాయణ, వెంకటేష్ చౌదరి, ఏసు, రాజారత్నం, వీరేష్, షేకన్న, రంగన్న, బాబు నాయుడు ఉన్నారు. **కౌతాళం,** ఉరుకుంద గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను, సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు ఉలిగయ్య, తుంగభద్ర ప్రాజెక్ట్ ఛైర్మన్ టిప్పు సుల్తాన్, సాయిబాబా, సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, వెంకటపతి రాజు, చౌదరి బసవరాజు, రాజానందు, ముక్కన, గిరి, మహదేవ నాయుడు, చిరంజీవి, పొట్లయ్య పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలంలోని బంటనహాల్ గ్రామంలో సర్పంచి సుశీలమ్మ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. జడ్‌పిటిసిల సంఘం మాజీ అధ్యక్షులు ఏరూరు మీనాక్షి నాయుడు, సర్పంచి సుశీలమ్మ, టిడిపి సీనియర్ నాయకులు సురేష్‌లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల నుంచి వస్తున్న సమస్యలపై కూడా దృష్టి సారించారు. వారు మాట్లాడుతూ... గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. సాగునీటి సంఘం డైరెక్టర్ రామాంజనేయులు, టిడిపి నాయకులు జనార్ధన స్వామి, బోగేష్, మిరపకాయల చంద్ర, గోపాల్ పాల్గొన్నారు. **కోసిగి** మండలంలోని చింతకుంట గ్రామంలో 'సుపరిపాలన'లో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. టిడిపి యువ నాయకులు రాకేష్, మండల నాయకులు ముత్తు రెడ్డి, తోవి రామకృష్ణ, నాడిగేని తాయన్న, అరివిలి వీరేష్, మైనార్టీ నాయకులు గౌస్, ఖలందర్, గ్రామ నాయకులు చిన్న మారయ్య, హనుమంతు, రామయ్య, చింతలయ్య పాల్గొన్నారు.



కోసిగి



ఆదోనిలో మాట్లాడుతున్న ఉమాపతి నాయుడు



కౌతాళంలో నాయకులకు స్వాగతం పలుకుతున్న ప్రజలు



చిప్పగిరి

బస్సు కోసం విద్యార్థుల నిరీక్షణ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు టూ టౌన్ పోలీసు స్టేషన్ రోడ్డు పక్కన శుక్రవారం సుమారు గంటపాటు బస్సు కోసం నిరీక్షిస్తూ కూర్చున్నారు. పాఠశాల నుంచి బాలికల హాస్టల్‌కు సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉంది. వారి రాకపోకల కోసం ఆర్‌టిసి బస్సు నడిపేవారు. ఉన్నట్టుండి బస్సును నిలిపివేయడంతో హాస్టల్‌కు కాలినడకన చేరుకోలేక రోడ్ పక్కన సుమారు వందమంది విద్యార్థులు కూర్చొని ఉన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు వారికి మద్దతుగా నినాదాలు చేయడంతో విషయం తెలుసుకున్న హాస్టల్ వార్డెన్ ప్రమీల ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి బస్సును రప్పించడంతో సమస్య పరిష్కారమైంది. విద్యార్థుల సౌకర్యార్థం రోజువారీగా బస్సు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు.



రోడ్డు పక్కన కూర్చున్న విద్యార్థినులు

'విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు'

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులను ఇబ్బందికి గురి చేస్తే చర్యలు తప్పవని డీఎస్పీ హేమలత హెచ్చరించారు. పట్టణంలోని పాఠశాలల వద్ద ఆకతాయిల ఆగడాలపై డీఎస్పీ హేమలత శుక్రవారం హెచ్చరికలు జారీ చేశారు. మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ పాఠశాలల ఆవరణలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలపరాదని సూచించారు.

తెర్నేకల్ బీసీ హాస్టల్ కమాటి అదృశ్యం

- ఎమ్మిగనూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు పట్టణం చాకలి వీధికి చెందిన చాకలి బజారప్ప (50) 8 రోజులుగా కనిపించడం లేదని ఆయన భార్య చాకలి నాగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక చాకలి వీధిలో ఆమె మాట్లాడారు. చాకలి బజారప్ప దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో కమాటిగా రెండేళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఎమ్మిగనూరు నుంచి తెర్నేకల్‌కు రోజూ బస్సులో వెళ్లి వచ్చేవారని, ఈనెల 10న ఎప్పటిలాగే ఉదయం లేచి తెర్నేకల్ బీసీ హాస్టల్ విధులకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లారని అన్నారు. అదే రోజు ఉదయం 10 గంటలకు హాస్టల్ వార్డెన్ 'నాకు ఫోన్ చేసి నీ భర్త ఈ రోజు డ్యూటీకి రాలేదు' అని చెప్పారని తెలిపారు. డ్యూటీకి వెళ్లకుండా ఏమైనా పని మీద వెళ్లాడేమో అనుకున్నామని, రాత్రి కూడా ఇంటికి రాలేదని చెప్పారు. మరుసటి రోజు హాస్టల్ వార్డెన్‌కు ఫోన్ చేసి 'నా భర్త డ్యూటీకి వచ్చాడా' అని అడిగామని, 'ఈ రోజు కూడా రాలేదు' అని వార్డెన్ చెప్పారని అన్నారు. అదే రోజు తాను, తన కుమారుడు వీరేష్, తన బావ కుమారుడు రాజు తెర్నేకల్ బీసీ హాస్టల్‌కు వెళ్లి వార్డెన్ మాదప్పతో పాటు అక్కడి సిబ్బందిని కలిసి మాట్లాడామని తెలిపారు. బజారప్ప డ్యూటీకి రాలేదని, మేం చూడలేదని చెప్పారని అన్నారు. పరిసర గ్రామాలతో పాటు ఆదోని, మంత్రాలయం, కసాపురం, ఎమ్మిగనూరు పట్టణంలో వెతికామని తెలిపారు. ఆచూకీ తెలియలేదన్నారు. తన భర్త ఇప్పటివరకు ఇంటికి రాలేదని వాపోయారు. తన భర్త ఆచూకీ కనిపెట్టి తెలుపాలని కోరారు. తన భర్త ఎత్తు 4.8, ఛామన ఛాయ కలర్, బ్లూ కలర్ ప్యాంట్, ఎరుపు రంగు కలర్ షర్ట్ వేసుకుని వెళ్లినట్లు తెలిపారు.



చాకలి బజారి (ఫైల్)

ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

-హార్టికల్చర్ ప్లాంటేషన్ వేగవంతం- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ కాలుష్య నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పి4కి సంబంధించి నిర్వహిస్తున్న గ్రామ సభల్లో బంగారు కుటుంబాల జాబితాను పరిశీలించి, అర్హులైన వారితో తుది జాబితాను తయారు చేయాలన్నారు. ఆ కుటుంబాలకు చేయూత అందించే మార్గదర్శులను కూడా గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి బంగారు కుటుంబానికి మార్గదర్శిని గుర్తించి మ్యాపింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 21 నుండి ఆగస్టు 5 వరకు బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారి అవసరాలపై సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 11706 ఇళ్ళ నిర్మాణాలు లక్ష్యంగా నిర్ణయించగా 7964 ఇళ్లు పూర్తయ్యాయని 3742 ఇల్లు ఇంకా పూర్తి కావాల్సిందన్నారు. ఆదోని డివిజన్ లో 1796, పత్తికొండ డివిజన్ లో 1241, కర్నూలు డివిజన్ లో 705 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి కావలసిందన్నారు. ఆయా డివిజన్ల ఆర్డీవోలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఇల్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆప్షన్ త్రీ కింద ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారులకు జమ చేసిన డబ్బును ఇళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

వాడే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎమ్మిగనూరు మండలంలో 202 పెండింగ్ ఉన్నాయని, గత వారంలో ఒక్క ఇంటి నిర్మాణం మాత్రమే పూర్తి చేయడం ఏంటని కలెక్టర్ హౌసింగ్ ఎఇపై పై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత ఎఇకి షో కాజ్ నోటీసులు ఇవ్వాలని హౌసింగ్ పిడిని ఆదేశించారు. మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ సబ్ డివిజన్ల లో పురోగతి చాలా వెనుకబడి ఉందని, సంబంధిత హౌసింగ్ డిఇ లను వివరణ కోరాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ పనులు వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు దినాలు పని కల్పించడం, సగటు వేతనాన్ని అందించడం అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పెండింగులో ఉన్న ఫామ్ పాండ్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.. డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, హౌసింగ్ పిడి చిరంజీవి, డ్వామా పిడి వెంకటరమణయ్య, డిఇఒ శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేయడం సరైంది కాదు

-హాస్పిటల్‌పై దాడి దాడి చేసిన వారిపై చర్యలకు ఎస్‌పిని కలిశాం

-ఇలాంటి ఘటనలు జరిగితే హాస్పిటల్స్ మూసేసైనా ఆందోళన చేపడుతాం.

-అప్నా, ఐఎంఎ సంఘాల హెచ్చరిక

కర్నూలు - ప్రజాశక్తి హాస్పిటల్

శ్రీ చక్ర హాస్పిటల్‌లో జరిగిన దాడి దురదృష్ట సంఘటన అని ఇలాంటి దాడులు పునరావృతం అయితే హాస్పిటల్స్ మూసివేసిన ఆందోళన చేపడుతామని అప్నా, ఐఎంఎ నాయకులు తెలిపారు. దాడికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ , ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఏవి సుబ్బారెడ్డి, ఐఎంఎ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రామచంద్ర నాయుడు, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, డాక్టర్ మాధవి, శ్యామల, అప్నా జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ .వేణుగోపాల్ తెలిపారు. కర్నూలు ఐఎంఎ భవన్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ దాడి విషయాన్ని జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో చర్చిస్తామన్నారు. అడగడానికి కూడా బేస్ లేని సమస్యను అబద్ధపు ప్రచారాన్ని తీసుకొని వచ్చిన మృతురాలి బంధువులు దౌర్జన్యంగా దాడులు చేయడం కరెక్ట్ కాదని అన్నారు. జ్వరానికి ట్రీట్మెంట్ తీసుకుని వెళ్ళిపోయారని మరుసటి రోజు ఉదయం బయట నాన్ ప్రొఫెషనల్ డాక్టర్ వ్యక్తులతో వారే ట్రీట్మెంట్, ఇంజక్షన్ వారే తీసుకున్నామని చెప్తున్నారన్నారు. తరువాత కుడా పేషెంట్ యాక్టివ్ గా ఉందని బాగా ఉందని టీవీ కూడా చూసిందని భార్తే చెప్తున్నారని సడన్‌గా చనిపోవడానికి ఏమైనా కారణం ఉండొచ్చన్నారు. అని దానికి 36 గంటల ముందు ట్రీట్మెంట్ ఎట్టి పరిస్థితుల్లో సంబంధం లేదని తెలుస్తుందన్నారు. 36 గంటల తర్వాత చని పోయిన ఘటనలు లేవని వారన్నారు. నాన్ ప్రొఫెషనల్ డాక్టర్స్ దగ్గర తీసు కున్న చికిత్సలో ఏమైనా పొరపాటు జరిగి ఉండొచ్చన్నారు. లేక ఈ మధ్యకాలంలో కోవిడ్ తర్వాత సడన్



మాట్లాడుతున్న ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ రామచంద్రనాయుడు

గుండెపోటులు వస్తున్నాయని, దానికి రకరకాల కారణాలు ఏమైనా ఉండొచ్చునని వేరే కారణాల వల్ల చనిపోయిన దానికి డాక్టర్లుకు ఆపాదించడం కరెక్ట్ కాదని వారన్నారు. దానిని అడ్డం పెట్టుకుని మరొకటి డిమాండ్ చేయడం అనేది అప్నా, ఐఎంఎ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. నిజంగా ఒక వ్యక్తి చనిపోవడం అనేది బాధాకరమైనదే మానవతా దృక్పథంతో సానుభూతి వ్యక్తం చేయడం కరెక్టేనని కానీ దానిని డాక్టర్ కు ఆపాదించడం సబబు కాదన్నారు. డాక్టర్ చూసే సమయానికే ఆమె చనిపోయిందని అప్పటికే అరగంటకు పైగా చనిపోయి ఉం దన్న సిమ్‌టమ్స్ ఉన్నాయని ఉన్న విషయాన్ని డాక్టర్ వ్యక్తపరిచారని, చని పోయిన వారికి ఎమర్జెన్సీ ట్రీట్మెంట్ ఎలా ఇస్తారని వార న్నారు. చనిపోయిన విష యాన్ని వారికి చెప్పినప్పుడు అర్థం చేసుకోకుండా దా డులు చేయడం కరెక్ట్ కాదని అన్నారు. వారికి ఏమైనా అనుమానాలు ఉంటే ఉన్న తస్థాయి విచారణ కోర వచ్చన్నారు. హాస్పిటల్ ను బంద్ చేయడం, వైద్యులను సిబ్బందిని దుర్భాషలాడడాన్ని అప్నా, ఐఎంఎ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. 2008 మెడికేర్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం, మెడికేర్ సర్వీసెస్, మెడికేర్ సిస్టం ఆక్ట్ ప్రకారం ఏదైనా పేషెంట్‌కు ఇబ్బంది జరిగినప్పుడు డాక్టర్ మీద ఎపిఎస్‌పికి, డిఎంహెచ్‌ఒకు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చాన్నారు. న్యాయ పోరాటాన్నయినా అప్నా, ఐఎంఎ స్వాగ తిస్తుందని అన్నారు. బాధ్యత కలిగిన అసోసియేషన్ సభ్యులుగా ఉన్న విషయాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియపరుస్తున్నామన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు నష్టం

-ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి- కోడుమూరు రూరల్

ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకంలో భాగంగా మహిళలకు ఆర్‌టిసి బస్సులు ఉచిత ప్రయాణాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేస్తానన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను తక్షణమే ఆదుకోవాలని కె. ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కోడుమూరు సిపిఎం కార్యాలయంలో ఆటో డ్రైవర్ల విస్తృత జనరల్ బాడీ సమావేశం సిఐటియు కోడుమూరు మండల కార్యదర్శి జిపి.వీరన్న అధ్యక్షతన నిర్వహించారు. ప్రభాకర్, సిఐటియు జిల్లా నాయకులు గఫూర్‌మియ్యా ఆటో డ్రైవర్లనుద్దేశించి దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలే కాక ఆటో డ్రైవర్లను ఆదుకుంటానని అనేక వాగ్దానాలు చేసిన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా అమలు చేయలేదన్నారు. అనేక జీవోలు అమలు చేసి అధిక చలనాలు అధిక ఫైన్లు వసూలు చేస్తున్నదన్నారు. గత వైసిపి



-మాట్లాడుతున్న ప్రభాకర్

ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర కింద ఇస్తున్న రూపదివేల కాదని, నేను అధికారంలోకి వస్తే రూ.15000 ఇస్తానన్న వాగ్దానాన్ని నేటికీ అమలు చేయడం లేదని వారన్నారు. మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు అమలు చేస్తానన్న ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఎలా ఆదుకుంటుందో ఇంతవరకు ప్రభుత్వం ప్రకటించ లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబాలకు నెలకు రూ.పదివేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర కింద రూ.15000 తక్షణమే విడుదల చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల పై భారంగా మారిన జీవో నెంబర్ 21 భారత్ న్యాయ సంహిత సెక్షన్ 106లను వెంటనే రద్దు చేయాలన్నారు. వాహనాల ఫిట్నెస్ సెంటర్లను ఆర్టిఒ ఆఫీస్ లో కొనసాగించాలని ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మనోహర్, కార్యదర్శి రంగారెడ్డి ,ఉపాధ్యక్షులు షాషాలను ఎన్నుకున్నారు. రంగస్వామి, రాజేష్, హుస్సేను తదితరులు పాల్గొన్నారు.


ముస్లిం మైనారిటీ విద్యార్థులతో రిటైర్డ్ ఐజి మహ్మద్ ఇక్బాల్ , ఉపాధ్యాయులు

చదువును మధ్యలో వదలకూడదు

ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రిటైర్డ్ ఐజి చేయూత

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో చదువును మధ్యలో వదలకూడదని మాజీ ఐజి షేక్ మొహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ ముస్లిం మైనారిటీల్లో విద్యపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని హైలైట్ చేస్తూ, విద్యార్థులు ఎలాంటి పరిస్థితుల్లోనైనా చదువు మానేయకూడదని పిలుపునిచ్చారు. 'విద్యే శక్తి, విద్యే భవిష్యత్తు' అని ఆయన పేర్కొన్నారు. నేటి బాలలే భావి భారత పౌరులని భావించి విద్యారంగ అభివృద్ధికి తాను చేయూతనివ్వాలనే ఉద్దేశంతో, కర్నూలు నగరంలోని కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉర్దూ మీడియం బాలుర హై స్కూల్‌కు ముగ్గురు విద్యా వాలంటీర్ల జీతాల కోసం తన సొంత నిధుల నుంచి రూ.9,000 (ప్రతి వాలంటీరుకు రూ.3,000 చొప్పున) విరాళంగా ఇచ్చారు. పర్మినెంట్ టీచర్లు నియమించేవరకు తానే వారి జీతాలు భరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యే శక్తి, విద్య భవిష్యత్తు అని భావించి మైనార్టీ విద్యార్థులు విద్యకు దూరం కాకూడదని భావించి వారికి అవగాహన కల్పిస్తూ సహాయం చేస్తున్నానని చెప్పారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా కిటికీల నిర్మాణానికి రూ.15,000, విద్యార్థులకు రూ.15 వేల విలువగల నోటు పుస్తకాలు, డ్రాయింగ్ పుస్తకాలు, కలర్ పెన్సిళ్లు, స్కేలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే తమ సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. పాఠశాల హెడ్ మిస్ట్రెస్ ఆసిఫా షాహీన్ మాట్లాడుతూ, విద్యార్థుల అడ్మిషన్లు పూర్తిగా ఉన్నా, బోధనా సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల బోధనలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుతం 180 మంది ప్రాథమిక విద్యార్థులకు కేవలం ఇద్దరు టీచర్లే ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సామాజిక కార్యకర్త , న్యూస్ ఎడిటర్ సయ్యద్ మహ్మూద్ పీర్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షేక్ మన్సూర్, జి. సురేందర్ (మాజీ కార్పొరేటర్) , జిల్లా ఎస్‌సి, ఎస్‌టి, అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, షేక్ మున్వర్, తదితర ప్రముఖులు ఈ మంచి కార్యక్రమాన్ని అభినందించారు.



శిథిలమైన మోరీలో దిగబడిన లారీ

-త్రుటిలో టులో తప్పిన ప్రమాదం

-ప్రమాదం పొంచి ఉన్నా స్పందించని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్: హోల్ సేల్, రిటైల్ వ్యాపార కేంద్రమైన పూల బజార్ కూడలిలో కల్వర్టు పై వేసిన ఇనుప మూత శిథిలమై శుక్రవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో కిరాణం సర్కులతో వచ్చిన లారీ దిగబడడంతో తృటిలో ప్రమాదం తప్పిందని ట్రాన్స్‌పోర్టు రంగం ప్రతినిధి వాసు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, రిక్షా కార్మికుల అడ్డా ప్రతినిధి బాలకృష్ణ, ఆటో యూనియన్ అడ్డా ప్రతినిధి బాల తిరుపయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం పాత నగరంలో అర్బన్ బ్యాంకు, చాంద్ టాకీస్ ప్రాం తాల మీదుగా పూలబజార్ కూడలి వరకు పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో ప్రతి ఏటా లక్షల రూపాయలు వెచ్చించి మోరీల గుంతలపై ఇనుప మూతలు బిగించి సిమెంట్‌తో మరమ్మతులు చేస్తున్నారు. అనేక ప్రాంతాల్లో నాసిరకం నిర్మాణాలు జరిగినందున ఏడాది తిరగకముందే శిథిలమై ప్రమాదాలకు కారణం అవుతున్నాయని తెలిపారు. మరమ్మతుల జరిగే సమయంలో నగరపాలక సంస్థ ఇంజనీర్లు సిబ్బంది పట్టించుకోవడంలేదని విమ ర్శించారు. కాంట్రాక్టర్లే ఇంజనీర్లుగా మారే పరిస్థితి దాపురించిందని అన్నారు. నాసిరకంగా నిర్మించిన ఇనుపమూతలు కొన్ని శిథిలమైపోతే కొన్నిటిని దొంగలు ఎత్తుకెళ్లి అమ్ముకుంటున్నారని తెలిపారు. చిల్లరదొంగతనాలు చేసే వారి కోసమే నాసిరకం నిర్మాణాలు నిర్మిస్తున్నారా..? అని ప్రశ్నించారు. కమిషనర్ నగరంలో పర్యటించి ప్రమాదకరంగా మారిన మోరీలపై వెంటనే ఇనుప మూతలు ఏర్పాటు చేసి నాసిరకం పనులను చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో మహమ్మద్ యూనుస్,షేక్ షాకీర్, టి.రాము తదితరులు పాల్గొన్నారు.